పో, అంతేగాని అస్తమాను నీ తలకాయలో ఇంట్లో వారిని మోయవద్దు. నీవు ప్రాపంచిక జీవితానికి విడాకులు ఇవ్వకుండా, ప్రపంచంలో ఉంటూనే ట్రైనింగ్ అయ్యి, ముగ్గిపోయి రాలిపోవాలి, అంటే దేహభిమానంలో నుండి రాలిపోవాలి. నువ్వు ఎవరిగా ఉన్నావో అది మర్చిపోవద్దు. నువ్వు ఎవరవు? నీలోపల ఉన్న జననమరణములులేని వస్తువేనీవు. నేను అనే తలంపు పుట్టక ముందు నువ్వు ఏదిగా ఉన్నావో అదే నీవు. దాని తాలుక ఎఱుక విడిచిపెట్టవద్దు, దాని తాలుక అనుభవం పొందేవరకు ఇలా జన్మించటం, మరణించటం తప్పదు, మాయ దారి ఇవ్వదు, కామక్రోధములు ఏనుగులు లాంటివి, ఈ ఏనుగులు అంత తొందరగా స్వాధీనంలోనికిరావు, సాధన అనే అంకుశంతో ఈ కామక్రోధములనే ఏనుగులను స్వాధీనం చేసుకో.

మనం ఇతరులను ద్వేషించటానికి ఏదైనా కారణం ఉన్నప్పటికీ ద్వేషరహితంగా ఉండాలి, కోపకారణం ఉన్నప్పటికీ కోపరహితంగా ఉండాలి. అలాకోపరహితంగా ఉండము అనుకోండి మనకు ఎవరిమీద అయితే కోపం వచ్చిందో మన కోపం వాడికి గుచ్చుకున్నా, గుచ్చుకోకపోయినా తిరిగివచ్చి మనకు మాత్రం గుచ్చుకొంటుంది, ఇలా ఎన్ని ముళ్ళను గుచ్చుకొనేలా మనం చేసుకొంటాము. ఆత్మస్తుతి, పరనింద ఉన్నవారి దగ్గర కూర్చోవద్దు, అబద్దాలు చెప్పి అయినా అక్కడ నుండి తప్పకోవటం మంచిది. పదిసంవత్సాలు మంచి స్నేహాలు చేసి ఒక ఆరునెలలు చెడుస్నేహం చేస్తే ఈ పదిసంవత్సరాలు మంచిస్నేహం చేసి మనం సంపాదించిన సద్బుద్ధి అంతా ఈ ఆరునెలలలో పోతుంది, అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనుకొనేవాడు అంత జాగ్రత్తగా ఉండాలి అని ఉపనిషత్‌లలో చెప్పారు. అవినయంరాకుండా చూసుకోవాలి. మాటలో ఆడంబరం పనికిరాదు. అవునంటే అవునని చెప్పండి, కాదంటే కాదని చెప్పండి, మీకు తొయ్యటంలేదు అనుకోండి, కంగారుపడి కమిట్ అవ్వవద్దు, ఆలోచించి చెపుతాము అని చెప్పండి. మీకు చేతనయితే ఇతరుల తెలివితేటలు పెంచండి, అంతేగాని వారికి ఉన్న తెలివితేటలు తగ్గించేయవద్దు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఆధ్యాత్మికఅభివృద్ధి పొందటంకోసం కేవలం భౌతికజీవితానికి విడాకులు ఇవ్వనక్కరలేదు. వినయంతో కూడిన జీవితం, శాంతచిత్తముతో కూడిన జీవితం, నమ్రతతో కూడిన జీవితం మనకు అమృతానుభవమును కలుగజేస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-03-04, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ శరీరం మరణించాక కొంతమందికి తొందరగా మరల శరీరం రావచ్చు, కొంతమందికి ఎక్కువకాలం పట్టవచ్చు మరల మానవశరీరం రావాలని లేదు వాడి కర్మానుభవాన్ని బట్టి ఆ జీవుడికి ఏదో శరీరం వస్తుంది, కాని ఏశరీరం వచ్చినా ఆశరీరంతో తాదాప్యం పొందిఉంటాడు. మన శరీరం అంటే మనకు ఎంత ఇష్టమో జంతువులకు కూడా వాటిశరీరం అంటే వాటికి అంత ఇష్టం. జీవుడికి వాడు ఏదేహంలో ఉంటే ఆ దేహం ఒక్కటే నిజం, అదే సర్వస్వం అని అనిపిస్తుంది. మంచి చేసినవాడికి దుర్గతిలేదు అని పరమాత్మ చెప్పాడు. మనం ఏదైనా మంచిపనిచేస్తే ఆఫలితం వెంటనే మనకు అనుభవంలోనికి రాకపోయినా మనం ఏ శరీరంలోఉన్నా, ఏలోకంలోఉన్నా ఆ ఫలితాన్ని మనకు భగవంతుడు కేటాయిస్తాడు. నీవు ఇతరులకు చేసిన సహాయసహకారములు అంతా నీకే తిరిగివచ్చేస్తుంది, ఇది నీకు అర్థమయితే ఇతరులకు సహాయసహకారములు అందించకుండా ఎలా ఉండగలవు అన్నారు భగవాన్. మనకు ఏదైనా కోరిక తీవ్రంగా ఉంటే అది ఏదో జన్మలో నెరవేరుతుంది అయితే ఆకోరిక నిజమా అంటే నిజంకాదు. శ్రీకృష్ణచైతన్య పూరిక్షేత్రానికి ఆకర్షింపబడ్డాడు. ఒకసారి శ్రీకృష్ణచైతన్య తన గురువు దగ్గరకు వెళ్ళి సన్యాసం తీసుకోవాలని ఉంది, అందుచేత నాకు సన్యాసం ప్రసాదించమని అడుగుతాడు. అప్పడు గురువు గారు ఏమని చెప్పారంటే అంటే సన్యాసం తీసుకోవాలంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉండాలి. మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం లేకుండా సన్యాసం తీసుకోవటం మంచిదికాదు అని చెప్పారు. నేను సన్యాసిగా జీవించగలను అని శ్రీకృష్ణచైతన్య గురువుతో చెప్పారు. అప్పడు గురువుగారు కొంచెం పంచదార తెచ్చి శ్రీకృష్ణచైతన్య నాలుకమీద వేసారు, ఒక నిమిషం తరువాత ఆయన నోటిలోని పంచదారను తీస్తే వేసినప్పడు ఎలాఉందో తీసిన తరువాత కూడా అలాగే ఉంది, తడి అవ్వలేదు. ఇప్పడు నువ్వు సన్యాసానికి ఫిట్ అవుతావు అన్నారు గురువుగారు. మనకు పంచదార నోటిలో వెయ్యనక్కరలేదు, చూస్తేనే లాలాజలం ఊరుతుంది.

ప్రథమవికారం అహంకారం, అది కాలిబూడిద అయ్యేవరకు మనకు ఏదో శరీరంవస్తూ ఉంటుంది ఎందుచేతనంటే అది శరీరం లేకుండా ఉండలేదు. ఆ ప్రథమవికారం వచ్చాక మిగతావికారాలు వస్తాయి అది రాకపోతే ఏదిరాదు. మనకు గాఢనిద్రలో ఆమొదటివికారంలేదు కాబట్టి మిగతావికారాలులేవు. జాగ్రదవస్థలోనికి వచ్చాక దేహంతో తాదాప్యం పొందే ఆమొదటివికారం వచ్చాక ఇంజను వెనకాల పెట్టెలు వచ్చినట్లు మిగతావికారాలు అన్నీ వస్తాయి. మన స్వరూపం శాంతి అయినప్పటికీ మనకు అశాంతి రావటానికి కారణం, మనకు దుఃఖం రావటానికి కారణం మనం ఏదోఒకటి అనుకొంటూ ఉంటాము, ఏదోఒకటి అనుకోకుండా ఈ ప్రథమవికారం ఉండలేదు. మన అమాయకత్వం ఎక్కడ ఉంది అంటే వారిలాగ ఉంటే బాగుండను, వీరిలాగ ఉంటే బాగుండును, వచ్చే జన్మ అలాగ ఉంటే మనకు సుఖంగా వెళ్ళిపోతుంది అని ఇలా ఏదోఒకటి అనుకొంటూఉంటాము కాని వారు ఎంత దుఃఖం అనుభవిస్తున్నారో మనకు తెలియదు. ఒక్క మన స్వరూపంలో తప్పించి బయట ఎక్కడా, ఏ వస్తువులోను సుఖంలేదు, ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి బయట ఎక్కడైనా సుఖం ఉన్నట్లు నీకు అనిపిస్తూఉంటే వూరికే నీకు అలా అనిపిస్తోంది గాని నిజంగా అక్కడ సుఖంలేదు, అవి మిధ్యాసుఖాలు, అవే రాబోయేజన్మలో దుఃఖాలుగా

వస్తాయి. అందుచేత మనం ఈ అనుకోవటాలు, ఊహించుకోవటాలు తగ్గిస్తే మనకు భయం తగ్గుతుంది, కోపం తగ్గుతుంది, చిరాకు తగ్గుతుంది, ఉద్రేకాలు తగ్గుతాయి. నిన్ను నీవు తెలుసుకోవటానికి అంతఃకరణశుద్ధిని సంపాదించుమని సనత్కుమారుడు నారదుడికి చెపుతాడు, నేను ప్రపంచంలో ఉన్న అన్ని విద్యలు నేర్చుకొన్నాను, ఎంతో పాండిత్యం ఉంది, కీర్తి ఉంది కాని నాకు దుఃఖం నశించలేదు అని నారదుడు సనత్కుమారుడిని అడిగితే అప్పుడు బ్రహ్మవిద్యను బోధిస్తాడు. ఏ వస్తువులో దుఃఖం ఇనుమంతయు కూడా లేదో, ఆ వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు దుఃఖం నిన్ను విడిచిపెట్టదు నిన్ను నీవు తెలుసుకో అంటే నీవు ఎవడిగా ఉన్నావో వాడిని తెలుసుకో నీవు ఆత్మవు, నీకు ఆత్మానుభవం కలిగినప్పుడు సుఖం స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఆత్మజ్ఞానం లేనివాడికి ఆత్మసుఖం లేదు, అమరత్వం లేదు. నాకు సుఖం అక్కరలేదు అని చెప్పేవాడు ఎవడైనా జీవకోటిలో ఉన్నాడా అంటేలేడు. కాని సుఖం ఎక్కడలేదో అక్కడ మనం సుఖం కోసం వెతుకుచున్నాము, ఇలా వేలాదిజన్మలు వెళ్ళిపోతున్నాయి. సుఖం ఎక్కడ ఉందో నీకు తెలియజేసి, అక్కడ వెతకటానికి నీకు సహాయసహకారములు అందించేవాడే గురువు. ఎక్కడైతే సుఖం ఉందో అటువైపుకు నీ మనస్సును మళ్ళించేవాడే గురువు. మనం అనుకోవటాలు ప్రారంభించగానే అశాంతి, దుఃఖం కూడా వచ్చేస్తాయి, ఇప్పుడు మనం అహంకారం మీద భారంవేసి జీవిస్తున్నాము భగవంతుడి మీద భారంవేసి జీవించటం నేర్చుకోండి.

మనం జీవితంలో భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని అభివృద్ధిలోనికి రావాలంటే ఏకాగ్రత ముఖ్యం. భగవంతుడిని స్మరించగా, స్మరించగా నీకు పవిత్రత కలుగుతుంది, ఏకాగ్రత కలుగుతుంది, ఏకాగ్రత కుదిరినవాడికి మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. మనం ఏకాగ్రత, పవిత్రత ఇవి రెండూ సంపాదిస్తే మనహృదయంలోఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. తలంపుల విషయంలోను, మాటల విషయంలోను బహూజాగ్రత్తగా ఉండాలి. ఎప్పుడైనా మనం పొరపాటుమాటలు మాట్లాడితే టైము చూసుకొని భగవంతుడు వెయ్యవలసిన మొట్టికాయలు వేస్తాడు. పాండవులు జూదంలో ఓడిపోయినప్పుడు కర్ణుడు ద్రౌపతితో వారు నీకు భర్తలా, పాండవులను వదిలెయ్యి, ధుర్యోధనుడిని పెళ్ళిచేసుకో అంటాడు. కర్ణుడు ఆమాట అనేవరకు ద్రౌపతిని అవమానం చేద్దామనే బుద్ధి దుర్యోధనుడికి లేదు. ఆమాట అన్నాకే ధుర్యోధనుడికి చెడ్డబుద్ధి కలిగింది. మనం మాటల దగ్గర ఎందుకు జాగ్రత్తగా ఉండాలంటే కర్ణుడు ఆమాటలు అన్నాడు అయిపోయింది, తరువాత కొంతకాలానికి యుద్ధం ప్రారంభమయ్యింది కర్ణుడికి, అర్జునుడికి యుద్ధం జరుగుతూఉంటే కర్ణుడి రథం భూమిలో దిగిపోయింది. అతడు మాట్లాడిన తప్పుడు మాటలు అనుభవించే టైము వచ్చింది. రధచక్రాన్ని పైకి ఎత్తటానికి దిగుతూ చక్రం పైకి తీసుకొంటాను, యుద్ధం చేయకు, ఇది ధర్మంకాదు అంటాడు, అర్జునుడు ఆలోచిస్తాడు, కాని కృష్ణుడు వాడికి ధర్మం ఏమిటి? చంపెయ్యి అంటాడు. ద్రౌపతిని మాటలు అన్నప్పుడు వాడికి ధర్మం ఏమయింది, నీవు ఆలోచించవద్దు, వాడిని చంపెయ్యి అని భగవంతుడు



చెపుతాడు. అందుచేత మనం ఏదైనా చెడ్డపని చేసినా, చెడ్డమాట్లాడినా తిరిగి మనం అనుభవించవలసిందే, అలా మనచేత అనుభవింపజేయటానికి పరిస్థితులు క్రియేట్ చేసేవాడే పరమాత్మ, నీవు ధర్మాన్ని కాపాడితే ధర్మం నిన్ను కాపాడుతుంది. మీరు ఎవరినైనా అవమానపరిచే మాటలు మాట్లాడితే మరల వారిచేత మాటలుపడే రోజులు మీకు తీసుకొని వస్తాడు. కొంతమంది అవసరం లేకపోయినా అహంకారం కోసం మాట్లాడుతూ ఉంటారు, అది చాల ప్రమాదం.

ఒక్కజ్ఞాని మాత్రమే నిజమైన సుఖి, వాడు ఆత్మానందాన్ని జుర్రుకొంటూ ఉంటాడు. అటువంటి ఆత్మజ్ఞానం ఎవరికైతే ఉందో వారిని ఆశ్రయించి, వారికి సేవచేసి, వారిని గౌరవించి ఆత్మజ్ఞానాన్ని సంపాదించు అని పరమాత్మ చెపుతున్నాడు. జ్ఞానికి అటువంటి గొప్పస్థానాన్ని ఇచ్చాడు. కాని మన పరిస్థితి ఎలాఉంది అంటే జ్ఞానికి శరణాగతి చెందటం మాట అటు ఉంచండి కనీసం జ్ఞానిపట్ల మనకు కృతజ్ఞత కూడా లేదు. ప్రతీదానికి కర్తృత్వం పెట్టుకోవద్దు, భగవంతుడి మీద భారంవేసి జీవించటం నేర్చుకోండి. బయట సంఘటనలవలన దుఃఖం వస్తోంది అని మీరు అనుకొంటున్నారు కాని దుఃఖానికి కారణం బయటలేదు, దుఃఖానికి కారణం కర్తృత్వం, ఆ కర్తృత్వం నశిస్తే దుఃఖం నిన్ను ముట్టుకోదు. మనసాధన యొక్క గురిఅంతా దుఃఖకారణం అయిన కర్తృత్వం మీదే పెట్టాలి. శరీరం నశిస్తే దుఃఖం నశించదు, కర్తృత్వం నశిస్తే దుఃఖం నశిస్తుంది. ఈబాధలు పడలేకపోతున్నాము చనిపోతే బాగుండును అని కొంతమంది అనుకొంటూ ఉంటారు. మన శరీరానికి సహజంగా మరణం రానివ్వాలి కాని బలవంతంగా చనిపోకూడదు బలవంతంగా చనిపోతే ఈజన్మలో దుఃఖం, రాబోయేజన్మలో దుఃఖం కూడా అప్పుడే అనుభవించవలసి ఉంటుంది. అది అలాజరగాలి, ఇది ఇలాజరగాలి అని మీరు అనుకొంటూ ఉంటారు. మీరు అనుకొన్నట్లుగా జరగకపోతే దుఃఖం వస్తుంది. భగవంతుడు ఎలాచేస్తే అలాగ అనుకొంటే, ఆభావన మీకు కుదిరితే మిమ్మల్ని అదృష్టం వెంటాడుతూ ఉన్నా, దురదృష్టం వెంటాడుతూఉన్నా మీరు దుఃఖరహితంగా జీవించగలరు, శరీరానికి మరణంవచ్చినా మీకు ఏమి అనిపించదు.

మీరు సాధన బాగాచేస్తూఉంటే మీకు కొన్ని మహిమలు రావచ్చు, అవిచూసి అవినయం తెచ్చుకోకూడదు, గమ్యానికి చేరేవరకు బహుజాగ్రత్తగా ఉండాలి. మీ ప్రారబ్ధాన్ని బట్టి మీకు ధనం వచ్చినా, అధికారం వచ్చినా అవినయం రాకుండా చూసుకోవాలి. ఎందుచేతనంటే నీరు పల్లానికి వెళ్ళటం ఎంత సహజమో వినయంగలవాడికి జ్ఞానం రావటం కూడా అంతే సహజం. అహంకారం పైకి ఎగురుతూ ఉంటుంది, కిందపడుతూ ఉంటుంది కాని లోపలఉన్న బ్రహ్మం ఎప్పుడూ సమానంగా ఉంటుంది, మన మనస్సు అంత సమానం అయితేగాని అది బ్రహ్మంలో ఐక్యంకాలేదు. మన మనస్సులో కొంచెం దోషంఉన్నా కూడా అది బ్రహ్మంలో ఐక్యంఅయ్యే అవకాశంలేదు. మనం భగవంతుడిమీద భారంవేసి జీవిస్తూఉంటే, ఆయనమీద ఉన్న విశ్వాసంలో కొరత లేనప్పుడు మన మాట, మన మనస్సు,

మనచేత అన్నీ కూడా ఆయనను తెలుసుకోవటానికి సహకరిస్తాయి. కుటుంబసభ్యులపట్ల, స్నేహితులపట్ల నీడ్యూటీ నీవుచేయాలి అంతేగాని మమకారం పెట్టుకోకూడదు, డ్యూటీ చేయటంవలన దుఃఖంరాదు, మమకారం వలన దుఃఖం వస్తుంది. ప్రతీమనిషికి వాడంటేనే వాడికి బాగాఇష్టం. మీభర్త అనుకూలంగా ఉంటే భర్త అంటే ఇష్టపడతారు అంతేగాని మీభర్త కంటే కూడా మీరంటేనే మీకు ఎక్కువఇష్టం. ప్రతీమనిషికి తనుఅంటే తనకు ఎక్కువఇష్టం ఎందుచేతనంటే తను ఆత్మ అయిఉన్నాడు కాబట్టి. ఎవరైనా మీకు ఉపకారం చేస్తే వారిని ప్రేమిస్తారు, ఎవరైనా మీకు అపకారంచేస్తే వారిమీద మీకు ఇష్టం ఉండదు, అక్కడ కూడా కేంద్రం మీరే. ఇది నేనుకాదు, ఇది నేనుకాదు అని అన్నింటిని తొలగించుకొంటూ వెళితే మిగిలేది నువ్వే. గాఢనిద్రలో మనం అన్నింటిలోనుండి విడిపోతున్నాము కాని అక్కడ మనం ఉన్నాము. మనం ఏదైతే కాదో అందులోనుండి విడిపోగలము కాని ఏదైతే మనమో అందులోనుండి మనం విడిపోలేము, దానిని తెలుసుకోవటమే జ్ఞానం.

నేను అనే తలంపు నీకు లోపలనుండి వస్తోంది. ఈ సృష్టికంతకు ఏవస్తువు అయితే ఆధారంగాఉందో అది నీ హృదయంలోకూడా ఉంది, అక్కడనుండే ఈనేను అనే తలంపు వస్తోంది, ఇది ముందు నీకు అర్థమవ్వాలి. ఈ మూలతలంపు మూలంలోనే చైతన్యం ఉంది. మూలతలంపు దానిమూలంలోనికి వెళితే అది నశిస్తుంది. మూలతలంపు నశిస్తే నీవు నశించవు, నీవు ఏదిగా ఉన్నావో అది నీకు అనుభవంలోనికి వస్తుంది, చైతన్యం అనుభవంలోనికి వస్తుంది. చైతన్యం అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇప్పటివరకు నీవు పడిన కష్టాలు, చావులు, పుట్టుకలు, ఈజన్మలు, భోగాలు ఇవిఅన్నీ అసత్యం అని అప్పుడు నీకు తెలుస్తుంది. అది ప్రత్యక్షానుభవం. ఏదో ఊహలమీద, ఎవరోచెప్పిన మాటలమీద ఆధారపడనక్కరలేదు. మాటలకంటే అనుభవం ముఖ్యం. నిప్పుమీద చేయివేస్తే కాలదుఅని ఎవరైనా చెప్పినా మనం నమ్ముతామా? నమ్మము ఎందుచేతనంటే అది మన అనుభవం, భగవంతుడు చెప్పినమాటను భగవంతుడితో సమానంగా గౌరవించాలంటే మీకు పుణ్యబలం ఉండాలి, సత్కర్మచేసి ఉండాలి. భక్తి లేకుండా శక్తిరాదు, భక్తిలేకుండా జ్ఞానంరాదు. గుణాలు మనలను పీడిస్తూఉంటాయి, ఈ గుణాలగొడవను, ఈ గుణాలతో తాదాప్యాన్ని వదిలించుకోవాలి. కళ్యాణగుణాలు కూడా వ్యవహారికసత్యమేగాని అవి ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి. మనకు గాఢనిద్రలో గుణాలు ఎక్కడ ఉన్నాయి, అవికూడా మనం కల్పించుకొన్నవే. ద్వేషం ఉన్నచోట అశాంతి ఉంటుంది, ప్రేమ ఉన్నచోట శాంతి ఉంటుంది, నీకు ద్వేషం ఎప్పుడైతే ప్రారంభమయ్యిందో అప్పుడు అశాంతి వచ్చేస్తుంది, లోపల క్షోభ ప్రారంభమవుతుంది. మనం ఎవరినైనా చూసి అసూయపడుతూఉంటే చనిపోయిన తరువాత ఏమౌతాము అనే గొడవ ప్రక్కన పెట్టండి, ముందు మన శారీరకఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చెడిపోతుంది. అసూయ రాకూడదు కాని, అసూయవస్తే 24 గంటలు కాలిపోతూ ఉంటాము, జ్ఞాని ప్రేమించకుండా ఉండలేడు, అజ్ఞాని ద్వేషించకుండా ఉండలేడు, ఒకసారి భగవాన్ రంగన్‌తో నేను పొందవలసింది ఏదో పొందాను, నేను చేయవలసిన పని అంటూ ఏమిలేదు అన్నారు. అప్పుడు రంగన్ భగవాన్‌తో చేయవలసినది ఏదిలేదు అంటున్నావు మరి నాతో ఎందుకు మాట్లాడుతున్నావు అని అడిగారు. అది పని ఉండి మాట్లాడటంకాదు, ప్రేమే మాట రూపంలో వస్తోంది, కరుణే మాట రూపంలో వస్తోంది అన్నారు. అమృతానుభవం పొందితే వాడు కళ్ళుమూస్తే ప్రేమ, తెరిస్తే ప్రేమ ఆ శరీరం ఉంటే ప్రేమ, లేకపోయినా ప్రేమే, వాడే ప్రేమ. మనకు లోపల ప్రేమలేదు కాబట్టి ప్రేమను నటిస్తాము, వాడు ప్రేమ నటించనక్కరలేదు ఎందుచేతనంటే వాడే ప్రేమ. మనకు నిజంగా వారిమీద ప్రేమ ఉండదు కాని మనకు వారిమీద ప్రేమ ఉంది అని వారు అనుకొంటే చాలు అని మనం అనుకొంటాము, ఇలా మన అహంకారం సంతృప్తిపడితే మనకు సరిపోతుంది ఇదీ మన పరిస్థితి, ఇది అజ్ఞానలక్షణం మనం జ్ఞానం కోసం బ్రతకటంలేదు, అహంకారం కోసం బ్రతుకుతున్నాము. జ్ఞానిలో రియాక్షన్ ఉండనే ఉండదు, జ్ఞానిలో ప్రేమ తప్పించి ఏమీ ఉండదు భగవాన్ శరీరం విడిచిపెడతారు అనగా చివరి రోజులలో ఒక భక్తుడు భగవాన్‌తో మీ సమక్షంలో శాంతిని, ప్రేమను అనుభవిస్తున్నాము, ఈ శరీరం మరణించాక మమ్మల్ని ఎవరు ప్రేమిస్తారు అని అడిగారు, అప్పుడు భగవాన్ ఏమిని చెప్పారు అంటే ఈ శరీరం ఉన్నప్పుడు కూడా శరీరం మిమ్మల్ని ప్రేమించటంలేదు, ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో దానికి చావులేదు. అందుచేత ఈ శరీరం పోతుందిగాని ప్రేమ అలా ప్రవహిస్తూనే ఉంటుంది. శరీరానికి, ప్రేమకు ఎట్టి సంబంధంలేదు అని చెప్పారు.

బ్రహ్మానుభవం పొందినవాడికి లోకం లోకంగా కనిపించదు, బ్రహ్మంగానే కనిపిస్తుంది. అందుచేత వాడు చూసేది బ్రహ్మం, వినేది బ్రహ్మం, అనుభవించేది బ్రహ్మం. చెఱుకుగెడను ముక్కలుక్రింద కోస్తాము, ముక్కలుక్రింద కోసాము అని కోపగించి తీపిదన్నాన్ని విడిచిపెట్టేసి అది మనకు చేదును ఇవ్వదు, ఆ ముక్కలు తియ్యగానే ఉంటాయి. జ్ఞానియొక్క పరిస్థితి కూడా అంతే, జ్ఞానియొక్క స్వరూపం అటువంటిది. ఏదివిన్నా బ్రహ్మమే, అంతా మధురమే. మీ హృదయంలో సత్యవస్తువు ఉంది. మీకుటుంబంకోసం, గౌరవాలకోసం, అధికారంకోసం మీరు ఎంత కష్టపడుతున్నారో, హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి అందులో 50% కష్టపడినా, ఆ వస్తువు మీకు అనుభవంలోనికి వస్తుంది. మీ కుటుంబాన్ని మీరు ఎంత ప్రేమిస్తున్నారో అందులో సగం ప్రేమ ఈశ్వరుని మీద ఉంటే, ఆ ప్రేమప్రవాహంలో మీరాగద్వేషములు కరిగిపోతాయి, ఇదివరకు మనకు రాగద్వేషాలు ఉన్నాయి అనే ఆచూకి కూడా తెలియకుండాపోతాయి, అట్టిది ఆవస్తువు తాలుక అనుభవం, అట్టిది ఆ ప్రేమ. మీరు అనేకజన్మల నుండి పుణ్యకర్మలు చేయగాచేయగా, సాధనచేయగా చేయగా మీతపనను చూసి లోపలఉన్న ఈశ్వరుడే గురురూపంలో వస్తాడు. మీకు గురువు మీద ప్రేమఉంటే, ఈశ్వరుడి మీద ప్రేమఉంటే ఆ ప్రేమప్రవాహంలో మీరాగద్వేషాలు కాలిపోతాయి, బూడిదకూడా కనబడదు. అప్పుడు మీహృదయంలో ఉన్న నిజమే మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

**రమణ భాస్కర**

**5-4-2004**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 07-04-04 | బుధ | పోడూరు వీరభద్రస్వామి ఆలయం |
| 13-04-04 | మంగళ | భీమవరం DNR College ఆడిటోరియమ్ |
| | | శ్రీ ఉద్దరాజు ఆనందరాజు గారి వర్ధంతి సందర్భంగా |
| 24-04-04 | శని | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం శంకర జయంతి సందర్భంగా |

## "రుచులను మరిగిన "జిహ్వా" వాంఛల్లి రెచ్చగొడుతుంది"

ఆరోగ్యమే మహాభాగ్యం అది మన చేతుల్లోనే ఉంది. శరీరఆరోగ్యం ఆత్మానందానికి సహాయకారిఔతుంది, శరీరం వ్యాధిగ్రస్తమైతే మనస్సు దాని మీద కేంద్రీకృతమౌతుంది - జీవితగమ్యాన్ని తప్పిపోతాము, తినటం కోసం బ్రతికితే తిప్పలు తప్పవు, బ్రతకటం కోసం తింటే బాగుపడతాము. రుచుల నీడ మనిషిని సదా వెంటాడి వస్తుంది. నాశనమైపోయే శరీరం యొక్క శోభను, వయస్సును పెంచటానికే ఇతర ప్రాణులను బలిచేయకూడదు, భూతదయ భగవంతుని సన్నిధికి చేరుస్తుంది. మాంసాహారం మానవుని మనస్సును క్రూరత్వంగా తయారుచేస్తుంది. దాన్ని నువ్వుగింజలో నూరోవంతు తిన్నా ఆధ్యాత్మికప్రగతికి అది బద్ధవిరోదం. విరిగిన మనస్సును ప్రేమతో అతికించవచ్చునేమోగాని చంపబడ్డప్రాణిని బ్రతికించలేము, మాంసం తినటంవల్ల ఆజంతు సంస్కారాలను మనం తీసుకొంటాము. శాఖాహారం భోజనంలో ఆ జీవులు మనస్సుతో తాదాప్యం జడప్రాయంగా ఉండటంవల్ల కర్మలభారం తక్కువ. ఏదిబడితే అది ఎలాబడితే అలా ఎక్కడబడితే అక్కడ తినకూడదు, నిర్ణీతమైన సమయంలో పక్వమైన ఆహారాన్నియుక్తంగాను. ధర్మజీవనంతో కూడిన దాన్ని తీసుకోవాలి. బజారు చిరుతిళ్ళతో, ఆ వండబడేవాని లాభాపేక్షతో కూడిన పిసినార సంస్కారంతో పాటు అన్ని సంస్కారాలు, మనకు సంక్రమిస్తాయి. ఒక సాధువు ఒక హోటల్‌లో భోజనం చేసాడు, వంటవానికి పేపరు చదివే పిచ్చిబాగా ఎక్కువ. అనతికాలంలోనే సాధువు కు ఆపిచ్చి ఎక్కింది, ఆహారం తయారుచేసే స్థలంలో జరిగే కలహాలు, వత్తిళ్లు అజీర్తికి కారణమౌతాయి. వడ్డింపులు, ఆరగింపులు ప్రశాంత వాతావరణంలో జరగాలి. శబరి ప్రేమతో కూడిన పళ్లరుచి తిన్న శ్రీరామునకు అయోధ్యలో ఏమధుర ఆహారం దానికి సాటిరాలేదు. ప్రీతితో పెట్టనిది పరమాన్నమైనా పిండాకూడుతో సమానం. సాత్వికఆహారం వల్లసాధనలో సగభాగం అదే తేలిక జేస్తుంది. మషాలాలు నిల్వపచ్చళ్ళు మానాలి. సాత్విక ఆహారంతో జీవించే గాంధీజీ ధీమాగా యిలా అన్నారు "నన్ను ఎవ్వరూ చంపక పోతే నేను వంద సంవత్సరాలు జీవించగలను" కాబట్టి రుచులపై అంకుశం పెట్టక తప్పదు. అలాచేసేవారు సద్గురువులకు శ్రమను తగ్గించిన వారమై నిర్వికారస్థితిని త్వరలో పొందగలం.

**సాగిరాజు రామకృష్ణంరాజు** - అర్ధవరం



**పాలకొల్లు ది. 21-03-2004న సద్గురు శ్రీ నాన్నగారికి గురుసత్కారం చేస్తున్న శ్రీ వసిష్ఠ సేవాశ్రమ అధినేత ఆచార్య శ్రీ కె.జి. ప్రసాదరాజుగారు**





**సద్గురు శ్రీ నాన్నగారికి గురు సత్కారం చేస్తున్న డా॥ సి.హెచ్. సత్యనారాయణ మూర్తి (బాబ్జి) దంపతులు**

## రమణభాస్కర పాఠకులకు మనవి !

రమణభాస్కర అందకపోయిన, మీ అడ్రస్సు మారిన, వెంటనే మీ పేరు ముందు ఉన్న నెంబరును వ్రాస్తూ డోర్ నెంబరు, వీధిపేరు, ఏరియా, పిన్‌కోడ్‌తో సహా సరియైన పూర్తి అడ్రస్సుతో కార్డు వ్రాయండి. వెంటనే పంపబడతాయి.